# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **అవినీతి రహిత పాలన లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు.**

**2.** **తెలుగు సినీపరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉంటుందని గద్దర్ సినీ పురస్కారాల ప్రదానంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.**

**3.** **రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను విజయ దశమి నాటికి పూర్తిచేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో వంద శాతం అక్షరాస్యత సాధనే లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**5.** **దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష.. నీట్ ఫలితాలు విడుదలయ్యాయి.**

==========================

అవినీతి రహిత పాలన లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి వ్యక్తమైన అభిప్రాయాలపై గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, ఉద్యోగాలకల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి...వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, ఆగస్ట్ 15వ తేదీ నాటికి అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర పరిధిలోనికి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

-------------------------

తెలుగు సినీపరిశ్రమకు అన్ని విషయాల్లోనూ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో నిన్న జరిగిన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2024 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కొన్ని అంశాల్లో కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. సినీ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటును అందించడంతో పాటు సముచిత స్థానం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డును నందమూరి బాలకృష్ణ, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమ దర్శకుడిగా నాగ్అశ్విన్‌కు పురస్కారాలు అందజేశారు.

---

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో పెండింగ్ లో ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను విజయ దశమి నాటికి పూర్తిచేసి పేదలకు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరులో నిన్న ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 28 లక్షల మంది డ్వాక్రా మహిళల సాధికారతే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. స్వయం సహాయక గ్రూపు సభ్యులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసేందుకు ట్యాబ్‌లు ఇస్తున్నామని నారాయణ వివరిస్తూ...

... వాయిస్ .. 29 సెకన్లు

---

మామిడి రైతులను ఆదుకోవడానికి సబ్సిడీ రూపంలో 168 కోట్ల రూపాయలు చెల్లిస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం గొల్లమడుగులోని మామిడి పండ్ల యూనిట్‌ను, మామిడి జ్యూస్ తయారీ విధానాన్ని ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు మార్కెట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మంత్రి సూచించారు.

---

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పీయుష్ గోయల్ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటల 30 నిమిషాలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన, మధ్యాహ్నం గుంటూరు జిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమవుతారు. అనంతరం గుంటూరు నగరంలోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, రాత్రి 9 గంటలకు తిరుపతి చేరుకుంటారు. రేపు ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఢిల్లీకి తిరిగి వెళతారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో వంద శాతం అక్షరాస్యత సాధించటమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో నిన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 67 లక్షల 27 వేలమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద 10 వేల 191 కోట్ల రూపాయలు అందచేశామని చెప్పారు. స్కూళ్లలో డ్రాప్ అవుట్స్ నివారించి, బడి వయస్సు పిల్లలందరూ చదువుకునేలా చేయటమే ఈ పథకం లక్ష్యమని మనోహర్ వివరిస్తూ..

... వాయిస్.. 33 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో డీఎస్సీ పరీక్షల తేదీల్లో మార్పులు జరిగాయి. ఈ నెల 20, 21వ తేదీల్లో

జరగాల్సిన పరీక్షలను వచ్చే నెల 1, 2వ తేదీల్లో నిర్వహిస్తామని మెగా డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలు మార్చిన హాల్ టికెట్లను apdsc.apcfss.inలో ఈ నెల 25వ తేదీ నుంచి అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

---------------------------

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ఏలూరు జిల్లా నూజివీడులోని క్యాంప్ కార్యాలయంలో 10 మంది విభిన్న ప్రతిభావంతులకు నిన్న ఆయన విద్యుత్ సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులకు అందించే పింఛను 6 వేల రూపాయలకు పెంచామని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పెన్షన్ 10 వేల రూపాయలకు పెంచామని తెలిపారు. అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు స్వయం ఉపాధి పథకం కింద రుణాలు మంజూరు చేయడంతో పాటు అర్హులైన వారికి గృహాలు కూడా అందిస్తామని పార్థసారథి వెల్లడించారు.

---------------------------

వైద్యుల కంటే రోగులకు నర్సులు అందించే సేవలు ఎంతో గోప్పవని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు తులసీ రామచంద్ర ప్రభు అందించిన 33 లక్షల రూపాయల విలువైన బస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ విధంగా దాతలు ముందుకు వచ్చి సమాజానికి సేవ చేయడపై హర్షం వ్యక్తంచేశారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు సమాజం పట్ల కృతజ్ఞత పెరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ తెలియజేస్తూ...

..వాయిస్..32 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష.. నీట్ ఫలితాలు విడుదలయ్యాయి. మే 4వ తేదీన జరిగిన నీట్ పరీక్ష ప్రాథమిక కీని ఇటీవల విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన జాతీయ పరీక్షల సంస్థ.. ఎన్‌టీఏ నిన్న ఫలితాలను ప్రకటించింది. స్కోర్ కార్డు కోసం అభ్యర్థులు తమ ఈమెయిళ్లను చెక్ చేసుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. తెలంగాణ నుంచి 41 వేల 584 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 36 వేల 776 మంది నీట్‌లో అర్హత సాధించారు.

---------------------------

బంగ్లాదేశ్ నుంచి ఉత్తర బంగాళాఖాతం మీదుగా దక్షిణ ఒడిశా వరకు, మరాఠ్వాడా నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు వేర్వేరు ఉపరితల ద్రోణులు ఏర్పడ్డాయి. అలాగే ఉత్తరాంధ్రకు ఆనుకొని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. వీటి ప్రభావంతో నిన్న కోస్తా, రాయలసీమల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. రాబోయే 24 గంటల్లోనూ ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

======================